క్లుప్తంగా

చర్చిల్లో క్రిస్మస్ కాంతులు



విద్యుత్ కాంతులతో బాప్టిస్ట్ చర్చి

ఆకివీడు: విద్యుత్ దీపాలంకరణతో పలు చర్చిలను అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులు నవంబర్ 25 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ప్రతీ రోజూ క్రిస్మస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా బాప్టిస్ట్ సెంచనరీ టౌన్ చర్చి రిప్రజెంటేటివ్, సీబీసీఎన్‌సీ రాష్ట్ర కార్యదర్శి రెవరాండర్ డాక్టర్ గూడపాటి జోసఫ్‌రాజు తెలిపారు. పలు గ్రామాల్లో క్రిస్మస్ కూడికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డంపింగ్ యార్డుకు రేకు గోడ ఏర్పాటు



డంపింగ్ యార్డు ప్రాంతంలో రేకు గోడ ఏర్పాటు చేసిన దృశ్యం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సిద్ధాపురం రోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు రేకు గోడ నిర్మించారు. దీంతో చెత్త సమస్యకు కొంత పరిష్కారం అయింది. పట్టణంలోని 20 వార్డుల్లో చెత్త వేసేందుకు వేరే మార్గాన్ని వెతుకుతున్నామన్నారు. గత కొన్నేళ్లుగా వేసిన చెత్త కుళ్లిపోయి మట్టిగా తయారైందని, ఆ మట్టిని వేరే ప్రాంతానికి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. డంపింగ్ యార్డుకు అవసరమైన స్థల సేకరణకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

వైభవంగా సుబ్బారాయుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు వద్ద వేంచేసియున్న వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరుడి గ్రామోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి స్వామి వారిని ప్రత్యేక వాహనంలో పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవ కార్యక్రమాన్ని అభివృద్ధి కమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మన్నే పోతరాజు, మోరా జ్యోతి, శ్రీనివాసరెడ్డి, మోటుపల్లి రామకృష్ణ, కిమిడి నాగరాజు, మధుసూదనరెడ్డి, సన్నిధి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం జిల్లా నాయకుడు కలిశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో జాతీయ సమితి పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.నాగార్జునకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర అనుసరిస్తున్న విధానాలపై తాము నిరసన తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సనపల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గోపిమూర్తి విజయంపై హర్షం



వీరవాసరంలో ఆనందం వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వీరవాసరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తి విజయం సాధించడంపై యలమంచిలి మండల యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్, మండల రెవెన్యూ కార్యాలయాలలో అధికారులకు, సిబ్బందికి, స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ భవనం నందు చెన్నుపాటి చిత్రానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం శ్రీనివాస్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు పంపన సాయిబాబు, బోను అచ్చయ్య,ఎం. దుర్గారావు, పి. హరే కృష్ణ, మల్లుల శ్రీనివాస్ (జేవీవీ)గూడూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

అంతటా వ్యాప్తి.. నియంత్రణ ఏదీ ?

- మురుగు కాలువల నిండా మొలుస్తున్న కిక్కిస
- నిప్పు పెట్టినా అంతమవ్వడం లేదు



ఉప్పుటేరులోకి చొచ్చుకుపోతున్న కిక్కిస



వేసవిలో కిక్కిసను దగ్ధం చేసిన దృశ్యం

ఆకివీడు: డ్రెయిన్లలో కిక్కిసతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి చిన్నపాటి వర్షానికే డ్రెయిన్లు ఉక్కిరి బిక్కిరై పొంగి సమీప పొలాలను ముంచెతుతున్నాయి. కిక్కిస.. ఇది మొండి, గడ్డి జాతి మొక్క. ఈదురు గాలులకు దూదిపింజంతో ఉన్న విత్తనం ఎగిరి వచ్చి మొలకలెత్తుతుంది. దీనికి తోడు అంటు వ్యాధి మొక్క ఇది. కొల్లేరు సరస్సులోకి ప్రవేశించిన కిక్కిస మొక్క గత 40 ఏళ్లుగా కొల్లేరు సరస్సులోనూ, పరీవాహక ప్రాంతాల్లో విస్తరించి ఉంది. గెడ జాతి మొక్కల్లో ఒకటైన కిక్కిస దేనికీ ఉపయోగం లేదు. ఈ జాతి మొక్క డ్రెయిన్ల వెంబడి దుబ్బులు దుబ్బులుగా పెరుగుతూ మురుగు నీటి ప్రవాహాన్ని కూడా నిలిపి వేస్తుంది. తూడు, గుర్రపు డెక్క పెరగడానికి కారణమవుతుంది.

డెల్టా డ్రైనేజీల్లో పెద్ద సమస్య

పశ్చిమ డెల్టా ప్రాంతంలోని డ్రెయిన్లలో కిక్కిస పెద్ద సమస్యగా మారింది. డ్రెయిన్లను ఆవరించి విపరీతంగా విస్తరిస్తుంది. దీని వేర్లు అతి బలంగానూ, దుంప ఉన్నట్లుగా పిలకలు పుట్టుకు వస్తాయి. బలమైన వేరుతో దీనిని కూకటి వేళ్లతో తొలగిస్తేనే గాని ఇది అంతమవ్వదు. ఈ జాతి మొక్క కొల్లేరు, పరిసర ప్రాంతాల ఉప్పుటేరు, ఇతర డ్రెయిన్ల వెంబడి విపరీతంగా పెరిగిపోతుంది. డ్రైనేజీల తవ్వకం పనులు గత ముప్పై ఏళ్లుగా చేపట్టకపోవడంతో డ్రెయిన్లకు ఇది రారాజుగా నిలిచింది. డ్రెయినేజీ వెంబడి చొచ్చుకు వస్తూ గ్రామాల్లోకి ప్రవేశించింది. పంట బోదెల్లో కూడా చొచ్చుకుపోతుంది. కిక్కిస వల్ల రానున్న రోజుల్లో మరింత ఇబ్బంది ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

నిప్పుపెట్టినా.. పుట్టుకొస్తుంది

వేసవిలో కొల్లేరులో కిక్కిస దగ్ధం ప్రతీ ఏటా చూస్తునే ఉన్నాం. మండుటెండలో కిక్కిస ఆకులు, పిప్పొడి రేణువులు ఎండిపోయి కనిపిస్తాయి. ఆ సమయంలో కిక్కిసను దగ్ధం చేస్తున్నారు. వర్షాలు పడిన తరువాత అదే ప్రాంతంలో వేరు నుంచి మొక్క పుట్టుకొస్తుంది.

ప్రతి ఏటా డ్రెయిన్ల తవ్వకమే పరిష్కారం

కిక్కిస అంతానికి ప్రతి ఏటా డ్రెయిన్లను తవ్వాలని రైతులు చెబుతున్నారు. డ్రెయిన్లలో పూడికలు తొలగించకపోవడం వల్లే కిక్కిస, గుర్రపుడెక్క మేట వేస్తుందని వారు వాపోతున్నారు. వర్షాలకు డ్రెయిన్లలో నీరు కదలక ముంపు బెడద ఏర్పడి, పంట పొలాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి పారుదలకు తీవ్ర నష్టం



కిక్కిస నీటి పారుదలకు తీవ్ర నష్టం. దీనిని అంతమొందించాలంటే నిరంతరం శ్రమించాలి. కాలువలో అట్టడుగుకు మొక్కను కోసివేస్తే చనిపోతుంది. నీటి పైన కోయడం వలన చిగురిస్తుంది. రైతులతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్లు కాలువలను తవ్వడంతో కిక్కిస పెరుగుదలకు ఆస్కారం ఏర్పడింది.

పాలూరి సోమరాజు, రైతు, సిద్ధాపురం, ఆకివీడు మండలం

డ్రెయిన్ల పూడిక తీయాలి



డ్రెయిన్లు తవ్వకపోవడం వల్లే కిక్కిస వ్యాప్తి చెందుతుంది. ఇది మరింత వ్యాప్తి చెంది గ్రామాల్లోకి వస్తే ఇబ్బందికరమే. దీని వల్ల రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పశువులు కూడా వీటిని తినే పరిస్థితి లేదు. వినియోగంలోకి తీసుకొస్తే కొల్లేరు ప్రజలకు కొంత మేర జీవనోపాధి ఉంటుంది.

–తోట శివాజీ, రైతు నాయకుడు, సిద్ధాపురం, ఆకివీడు మండలం

రేపు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

పాలకోడేరు: ఈ నెల 11వ తేదీన పాలకోడేరు క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో గ్లోబల్ ఫౌండేషన్ (యూఎస్‌ఏ) వారి సౌజన్యంతో పాలకోడేరు విశాల సహకార సంఘ భవనం ఆవరణలో ఉదయం ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పాలకోడేరు క్షత్రియ సేవా సమితి సభ్యులు డాక్టర్ గాదిరాజు కృష్ణంరాజు (హేచరీ బాబు) తెలిపారు. ఈ శిబిరంలో పరమహంస యోగా నంద కంటి ఆసుపత్రి, రాజమండ్రికి చెందిన వైద్యులు పాల్గొంటారన్నారు. శిబిరంలో కంటిలో అద్దం అమర్చ, కుట్లు లేకుండా శస్త్ర చికిత్సలు, ఉచిత మందుల పంపిణీ, నాణ్యమైన ఉచిత కళ్లజోళ్ల పంపిణీ మొదలైన సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి సంబంధిత ఆసుపత్రికి ఉచిత రవాణా, భోజన వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఉచిత శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు గాని మరి ఏ ఇతర గుర్తింపు కార్డు గాని తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9849133244, 9908225837, 8977003355 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన గంటి దుర్గారావు (38) అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల ఏడో తేదీన ఇంటి నుంచి బయలుదేరి నిడమర్రు మండలం మందలపర్రు గ్రామంలోని కారు డ్రైవింగ్ కోసం ద్విచక్ర వాహనం (యాక్టివా)పై వెళ్లాడు. డ్రైవింగ్ ముగించుకుని రాత్రి సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా రాత్రి పదిన్నర గంటల సమయంలో ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే రోడ్డుపై గుంతల్లో పడడంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎనిమిదో తేదీ ఆదివారం మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య మియామీ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ డి.రవి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడలిపై అత్త ఫిర్యాదు

భీమవరం: అత్తపై కోడలు దాడి చేసి గాయపర్చిన సంఘటన ఇది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయలం గ్రామానికి చెందిన ఒక మహిళ తన మూడవ కోడలు గర్భం రాకుండా ట్యూబ్ వేయించుకుందని ట్యూబ్ తీయించి పిల్లల్ని కనాలని ఆదివారం కోరిందన్నారు. వీరిద్దరి మధ్య తలెత్తిన ఘర్షణలో సెల్‌ఫోన్‌తో కోడలు ఆమె నుదుటిపై కొట్టడంతో గాయాలయ్యాయి. ఆమెను ఆసుపత్రికి అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రెహమాన్ తెలిపారు.

రేపు యూపీఏ క్రిస్మస్ వేడుకలు

ఉండి: ఈ నెల 11వ తేదీన ఉండి మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్(యూపీఏ) ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు కె.మెల్కిసెదక్, ఎం.ఇమ్మానుయేలు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని వారు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

ఆకివీడు: భర్త, అత్త మామలు వేధిస్తున్నారని స్థానిక శ్రీనగర్ కాలనీకి చెందిన బోడిగడ్డ పాల్‌కుమారి సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఏప్రిల్ 29వ తేదీన యాళ్ల రాజకుమార్‌తో వివాహమైందని అప్పటి నుంచి పలు రకాలుగా వేధిస్తున్నారని ఫిర్యాదు ఇచ్చిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని చేసినట్లు ఎస్సై తెలిపారు.

భీమవరం: తన భర్త, అత్త మామలు, బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని టూటౌన్‌కు చెందిన నంబూరి లక్ష్మీదీప్తి సోమవారం పోలీసులు ఫిర్యాదు చేసింది. లక్ష్మీదీప్తికి సునీల్‌వర్మతో 2018లో వివాహం కాగా ఆ సమయంలో 10 ఎకరాల పొలం, రూ.10 లక్షల నగదు, 40 కాసుల బంగారం కట్నంగా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులు రావడంతో పెద్దల సమక్షంలో పెట్టినా సమస్య పరిష్కారం కాక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రెహమాన్ తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



భీమవరం ప్లాస్టిక్ కవర్ల వినియోగం వద్దంటూ ర్యాలీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని భీమవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆధ్యాత్మిక చైతన్య గ్రూపు మహిళలు గుడ్డ సంచులు వాడదాం–పర్యావరణం పరిరక్షిద్దాం అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేతి గుడ్డ సంచులు, గన్ని సంచులు వినియోగించుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి కారకాలైన ప్లాస్టిక్ కవర్స్ వాడకానికి ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ చేతి గుడ్డ సంచులను ఉపయోగిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సరిపెల్ల రజని, వేగి వాణిశ్రీ, దేవి, విజయలక్ష్మి, దుర్గా, శ్రీవల్లి, సరస్వతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): కరాటే విద్యలో మరింతగా రాణించి జిల్లాకు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇటీవల మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో మూడు పతకాలు సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విద్యార్థులను సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు ఆమె అభినందించారు. ఈ సందర్భంలో శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మలేసియా దేశంలో జరిగిన కరాటే పోటీల్లో ఈ ముగ్గురు విద్యార్థులతో పాటు 11 దేశాల్లోని 16 మంది ఎంపిక అయ్యారని, వారిలో నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీలు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులు ఇమ్మానుయేల్ చిల్డ్రన్ హోమ్‌లో వసతి పొందుతున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. క్రీడలలో రాణిస్తే వ్యక్తిగత గుర్తింపుతో పాటు జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మాన్యుయేలు చిల్డ్రన్ హోం నిర్వాహకులు ఎస్‌ఎస్ పాల్, కరాటేలో మెడల్స్ సాధించిన విద్యార్థులు అశ్విని, ప్రియ, జెస్సీలు, తదితరులు ఉన్నారు.

అదానీ అవినీతిపై విచారణ జరపాలి



భీమవరంలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం: అదానీ అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని అప్పటి ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. భీమవరంలో సోమవారం అదానీ అవినీతిపై పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని, మణిపూర్ హింసాత్మక ఘటనలు అరికట్టాలని, అధిక ధరలను అరికట్టి నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఒప్పందాల కోసం రూ.2,100 కోట్లు నాలుగు రాష్ట్రాలకు అదానీ లంచాలుగా ఇచ్చినట్లు వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించాలని, రాష్ట్ర ప్రజలపై పడే విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని రంగారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాలా త్రిమూర్తులు, పి యాకోబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేతతో ప్రయాణికుల అగచాట్లు



మూసి వేసిన రైల్వే గేటు

ఉండి: రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతుల కారణంగా తొమ్మిదో తేదీ సోమవారం నుంచి 18వ తేదీ వరకు అనగా సుమారు పది రోజుల పాటు రైల్వేగేటు మూసివేడంతో ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. జాతీయ రహదారి 165 కావడంతో ప్రతి రోజూ వేలాది వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణాలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఆకివీడు వైపు నుంచి భీమవరం వచ్చే వాహనాలు ఆకివీడు, ఏలూరుపాడు, కాళ్ల మీదుగా భీమవరం చేరుకోవాలని పోలీసులు తెలిపారు. అలాగే ఆకివీడు వైపు వెళ్లే వాహనాలను కూడా అదే దారిలో మళ్లించారు. ఆయా రహదారుల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిపోవడంతో వాహనదారులు ఇతర మార్గాలు ఎంచుకుంటున్నారు. మొత్తానికి ఉండి రైల్వే గేటు మూసివేత వాహనదారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది.

ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు 10 మందికి ఇపిరాక్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 25వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించారు. సోమవారం కళాశాలలో విద్యార్థులకు చెక్కులను పంపిణీచేసిన సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ మైనింగ్ సంస్థ విద్యార్థుల సామాజిక, ఆర్థిక, గ్రామీణ, విద్యా ప్రగతి నేపథ్యాలను పరిశీలించి విద్యా ప్రోత్సాహం కింద స్కాలర్‌షిప్‌లు మంజూరుచేయడం అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీ కృష్ణంరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ కేఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇపిరాక్ స్కాలర్‌షిప్ అవార్డు ప్రోగ్రాం– 2024 పేరిట ఇపిరాక్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గత కొన్నేళ్లుగా పలు అంశాలను పరిగణలోకి తీసుకొని తమ కళాశాలలో విద్యార్థులకు స్కాలర్‌షిపులు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు.

ఈ–పంట నమోదు పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏడీఏ ఈదా అనిల్‌కుమారి

నరసాపురం రూరల్: రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన ప్రతి పైరునూ ఈ–పంటలో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఈదా అనిల్ కుమారి అన్నారు. సోమవారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్‌లోని మూడు మండలాల వ్యవసాయ, ఉద్యాన శాఖల ఎంపీఈవో లకు రబీ ఈ–పంట నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ ఈ–పంట నందు కొత్తగా వచ్చిన మార్పుల గురించి, దాళ్వా పంటలో వచ్చే జింక్ లోపం, దాని నివారణ, ఎరువులు యాజమాన్యం ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15 వరకూ పంట బీమా నమోదు కార్యక్రమం చేపడతారని, ఈ విషయాన్ని గమనించి, ప్రతి రైతూ పంట నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మొగల్తూరు, యలమంచిలి ఏవోలు రహీమ్, దేవి, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి



మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న వీర విజయలక్ష్మి

వీరవాసరం: డ్వాక్రా సంఘ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డ్వాక్రా సంఘ మండల సమాఖ్య అధ్యక్షురాలు కామిశెట్టి వీర విజయలక్ష్మి తెలిపారు. వీరవాసంలోని డ్వాక్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. డ్వాక్రా గ్రూపు సభ్యులంతా బ్యాంకు లింకేజీ రుణాలను, స్త్రీ నిధి రుణాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. బ్యాంకు రుణాలను, పొదుపులను సక్రమంగా జమ చేసుకోవాలని వివరించారు. సమావేశంలో ఏపీఎం కే జ్యోతి, సమైక్య కార్యదర్శి పంపన మల్లీశ్వరి, ఉపాధ్యక్షులు కురెళ్ల కాశీ అన్నపూర్ణ, జాయింట్ కార్యదర్శి కే భాగ్యలక్ష్మి, ట్రెజరర్ విప్పర్తి సరోజిని ,రాయకుదురు సిసి కే శ్రీరామమూర్తి కొంటివాడ సీసీఎస్ పద్మావతి, వీరవాసరం సీసీబి మణికుమారి, సంధ్య, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

గొందిలో క్లూస్‌టీం వేలి ముద్రల సేకరణ

నరసాపురం రూరల్: మండలంలో కొంత కాలంగా వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా నరసాపురం మండలం గొంది గ్రామానికి చెందిన శీలబోయిన రామకృష్ణ శనివారం బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటిలో దొంగతనం జరిగినట్లు గుర్తించి 100 నెంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రంగంలోకి దిగిన రూరల్ ఎస్సై సురేష్ ఎటువంటి ఆధారాలు దొరకకపోవడంతో సోమవారం క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ దొంగతనంలో సుమారు నాలుగు కాసుల బంగారం, ఐదు వేల నగదు రెండు జతల వెండి పట్టీలు అపహరణకు గురైనట్లు బాధితుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

సేంద్రియ కూరగాయలతో ఆరోగ్యానికి మేలు



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్న అధికారులు

మొగల్తూరు: రసాయనాలు వాడకుండా జీవామృతం, కషాయాల ద్వారా పండించిన కూరగాయలు తినడం వలన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మొగల్తూరు, శేరేపాలెం పంచాయతీల్లోని పలు ప్రాంతాల్లో పండించిన వివిధ రకాల కూరగాయలను, ఆకుకూరలను అమ్మారు. దీంతో అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య, వసతిగృహ అధికారులు సాగర్, ధారవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఈఓపీఆర్డీ నవీన్‌కిరణ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.లక్ష్మీకుమారి, ఉంగరాల రామలక్ష్మి, శీలం మహాలక్ష్మి, గురుజు కనకదుర్గాభవాని, గూడూరి మావుళ్లు, ఆర్.పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీటీ సంధ్య (ఫైల్)

మొగల్తూరు: మండలంలోని పలు చౌక డిపో దుకాణాలను శనివారం తనిఖీ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సంధ్య సోమవారం తెలిపారు. మొగల్తూరులో నాలుగు దుకాణాలను, ముత్యాలపల్లి, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు జారీ చేశామని ఆమె తెలిపారు. ఆమె వెంట వీఆర్వోలు, తదితరులు ఉన్నారు.

సబ్‌జైలు తనిఖీ

నరసాపురం: సబ్‌జైలులో శిక్షలు అనుభవిస్తూ న్యాయవాదిని నియమించుకుని, బెయిల్ తెచ్చుకునే స్తోమత లేని వారు ఉచిత న్యాయ సహాయాన్ని పొందొచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. సోమవారం రత్నప్రసాద్ నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ముద్దాలయిలకు నియమించబడిన ఉచిత న్యాయ సలహాదారులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నరసాపురం టౌన్ సీఐ యాదగిరి, రూరల్ ఎస్సై టీవీ సురేష్, యలమంచిలి ఎస్సై గురవయ్య, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.